మినీకథ



# రబ్బరు బ్యాండ్

ఇ.డి. దేవప్రసాద్

"అమ్మాయి మాకు నచ్చింది! ఇక కట్నం విషయం తేల్చండి!" కొత్త కటువుగానే అంది వియ్యంకురాలు తారాబాయి.

ఓరచూపులతో 'అనంత్'ని గమనిస్తూ తల దించుకొని కూర్చున్న 'అనిత' ఉలిక్కిపడి చివ్వున తలెత్తింది. 'కట్నం' పేరు వింటేనే మండిపడే కూతురు ముందు వియ్యంకురాలు ఆ విషయం ఎత్తగానే గాభరాపడ్డారు అనిత తల్లిదండ్రులు అనసూయమ్మ, వరంధామయ్యగార్లు.

నవీన భావాలుకల అనంత్ వెంటనే- "అమ్మా! నేను ముందే చెప్పాను కదా, కట్నం తీసుకోవడం నా అభిప్రాయానికి విరుద్ధమని. మీరు ఇలా చేస్తే నేనసలు పెళ్ళే చేసుకోను!" కఠినంగా అన్నాడు.

కొడుకు మొండితనం తెలిసిన తారాబాయి గొంతు తక్కున మూతబడింది.

మెచ్చుకోలుగా చూసింది అనిత అనంత్ వైపు. తన అభిప్రాయాలకు తగిన భర్త దొరికాడన్న తృప్తి ఆమె కళ్ళలో స్పష్టంగా కనబడుతోంది. ఓక్షణం వారిద్దరి చూపులూ కలుసుకొన్నాయి.

* * *

కాలచక్రం 20 సంవత్సరాలు గిర్రున తిరిగింది. ఇప్పుడు అనిత అనితమ్మగారిగా, అనంత్ అనంతయ్యగారిగా మారారు. వారి ఏకైక పుత్రుడు 'వినోద్' పెళ్ళిచూపులకెళ్ళారు.

"చూడండి! మావాడు ఇంజనీర్! కనీసం రెండు లక్షలు కట్నం ఇవ్వందే కుదరదు" హుందాగా అంది అనితమ్మ.

"అంత ఇచ్చుకోలేమండి! పోనీ ఓ లక్ష సర్దుకోండి...." దీనంగా ఉంది వియ్యపురాలి గొంతు.

"అదేం లాభం లేదండి!.... వాడికి రెండు లక్షలు కాక ఓ ఫారిన్ కారు.... ఇస్తామని ఎందరో...." చెప్పుకుపోసాగింది అనితమ్మ. చేతిలో ఉన్న "రబ్బర్ బ్యాండ్"ను సాగదీస్తూ కూర్చున్న అనంతయ్య ఏదో అర్థమైనట్లు నవ్వుకున్నాడు భార్యవైపు చూస్తూ.... ○

